క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి 3వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అలాగే 4, 5, 6, 7, 8, 9వ తరగతులలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వివరాలకు 9505336767 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు అక్షర కోచింగ్ సెంటర్ హరిప్రసాద్ విద్యా సామగ్రిని వితరణ చేశారు. 70 మంది విద్యార్థులకు ప్యాడ్, పెన్సిల్, స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వసంతకుమారి, సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, విజయకుమారి, సహదేవరావు, ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ, ప్రసవాల సంఖ్య పెంచండి

కలకడ : ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి, ప్రసవాల సంఖ్యను పెంచాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. మంగళవారం కలకడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. వైద్యులకు అంకితభావం ముఖ్యమని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించాలన్నారు. ఆసుపత్రిపై నమ్మకం పెంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

రామసముద్రం : మండలంలోని బ్యాడపల్లె బార్డర్ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కుదురుచీమనపల్లె పంచాయతీ వనగానిపల్లె, గుంతయెంబాడి గ్రామాలకు చెందిన పి.రవికుమార్, పి.కట్ట రవి ద్విచక్రవాహనంపై మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 90 ఎంఎల్ 120 టెట్రా ఛాయిల్ ప్యాకెట్లు, 180 ఎంఎల్ 44 ఓల్డ్ టవేరిన్ విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఏనుగు మల్లమ్మకు జ్యోతులు సమర్పణ

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగు మల్లమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలు కొండపైకి జ్యోతులు తీసుకెళ్లారు. కోటావూరు, బండారువారిపల్లె, బయ్యప్పగారిపల్లె, గోళ్లపల్లె, తుమ్మనంగుట్ట గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఏనుగుమల్లమ్మకు జ్యోతులు మోసుకొచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నిమ్మనపల్లె : ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ వాహనదారులు రోడ్డు భద్రత నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, తదితర ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి వాహనాలను వేగంగా నడపడం, ప్రయాణికులను ఎక్కించుకోవడం చేయవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకోండి

కేవీపల్లె : ఏపీ గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ చెన్నకేశవులు, ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జె.సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20న రాయచోటిలో జరుగుతుందని తెలిపారు. 5,6,7,8 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా గంగజాతర

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ జంగాలపల్లె, ఆర్.కమతంపల్లె గ్రామాల్లో మంగళవారం అంగరంగ వైభవంగా గంగజాతర నిర్వహించారు. రాత్రి 11 మంది గ్రామదేవతలకు మహిళలు ఉపవాసాలతో దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటాలు, చెక్కభజనలతో జాతర నిర్వహించారు. అనంతరం గంగమ్మ గ్రామదేవతను గ్రామంలో ఊరేగించారు.

నేడు కోటకొండ గంగమ్మ తిరునాల

తంబళ్లపల్లె: మండలకేంద్రం సమీపంలోని వారపుసంత తోపులోవెలసిన శ్రీకోటకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలతో తిరునాల వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం కోటకొండ గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పూజారులు శ్రీనివాసులు, చిన్నప్ప ఇంటింటికీ వెళ్లి అమ్మవారి తిరునాల చాటింపు చేశారు.

నవరత్నాలతో ప్రజల జీవనం మెరుగు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: నవరత్నాలతో ప్రజల జీవనం మెరుగుపడింది. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పంచాయతీ పూజారివాండ్లపల్లి, దాసరివారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. అందుకే గత మూడున్నర ఏళ్లుగా ఎక్కడ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ, ఇతర పథకాలు అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. అలాగే మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన రమేష్ తల్లి అలివేలమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతురాలి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, పంచాయతీ సెక్రటరీ నాగేంద్ర, నాయకులు రమేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనాథ రెడ్డి, నల్లంకి నరసింహులు, సుధాకర్, వెంకట్రమణ, కిరణ్ కుమార్, మోహన్‌రెడ్డి, చెంగల్ రెడ్డి, మెంబర్ శీనా, ఫారుఖ్, ప్రియరంజన్ రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, రవి, ఆనంద, రఘు, షాహెద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

వాల్మీకిపురం: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఐదుగురికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.16,00,000లను ఎమ్మెల్యే చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించారన్నారు. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వెంకట్రమణ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నియోజక వర్గ నాయకులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకొంటాం

గుర్రంకొండ: కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్నివిధాలా ఆదుకొంటామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కంట్రిగ గ్రామానికి చెందిన పఠాన్ హమీద్ స్థానిక మార్కెట్‌యార్డులో దినసరి కూలీగా పనిచేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. గత మూడు నెలల క్రితం మార్కెట్‌యార్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హమీద్ మృతి చెందాడు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షలు పరిహారం మంజూరైంది. ఈనేపథ్యంలో మంగళవారం గుర్రంకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో బాధితుడి భార్య మౌలాబికి రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తాము అండగా ఉండి ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకొంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సహ్రీన్ ముక్తియార్, సర్పంచ్ రౌనఖ్‌బాషా, మాజీ కోఆప్షన్ సభ్యులు ఆజాంఆలీఖాన్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

చౌకబారు, వ్యక్తిగత విమర్శలు తగవు

కురబలకోట: పెద్దిరెడ్డి కుటుంబీకులపై నారా లోకేష్ చౌకబారు, వ్యక్తిగత విమర్శలు చేయడం తగవని, తంబళ్లపల్లె అభివృద్ధిపై చర్చకు సిద్ధపడాలని రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సురేంద్రనాథ్ సవాల్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నారా లోకేష్ ఇదివరలో నియోజక వర్గంలో యువగళం పాదయాత్ర సాగించినప్పుడు కూడా తంబళ్లపల్లె నియోజక వర్గంలో అభివృద్ధి లేదని విమర్శించారన్నారు. ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్టు మాట్లాడి వెళ్లిపోయారన్నారు. ఎవర్ని ఎలా మాట్లాడాలో ముందు లోకేష్ నేర్చుకోవాలన్నారు. నూరు రోజుల సంఘీభావ యాత్ర అని ములకలచెరువులో కూడా అనవసరంగా టీడీపీ రాద్ధాంతం చేసిందన్నారు.

యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలి

మదనపల్లె సిటీ: యువత సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని మదనపల్లె టు టౌన్ ఎస్‌ఐ లోకేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోని హెల్పింగ్‌మైండ్స్ ఏర్పాటు చేసిన ఫుడ్‌బ్యాంకును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఫుడ్‌బ్యాంకు ద్వారా ఎంతో మంది అనార్తులకు ఆకలి తీర్చడం జరుగుతుందన్నారు. అనాథలను ఆదుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్‌సిద్ధిక్, సభ్యులు హనీఫ్, ఆనంద్, గౌస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై డిస్పెన్సరీ సేవలు



హార్సిలీహిల్స్‌పై డిస్పెన్సరీని పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని ప్రఖ్యాత వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో వైద్యసేవలు అందించేలా డిస్పెన్సరీ ఏర్పాటైంది. జిల్లాలో ఏకైక పర్యాటక ప్రాంతం. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని ఈ కొండపై మండువేసవిలోనూ వాతావరణం చల్లగా ఉంటుంది. స్థానిక జనాభా 200 మంది దాక ఉంటారు. రాకపోకలు సాగించే సందర్శకుల సంఖ్య సోమ–గురువారాల్లో రోజుకు వంద నుంచి రెండొందల మంది ఉంటారు. శుక్ర, శని, ఆదివారాల్లో రోజుకు వెయ్యి మంది వరకు వస్తుంటారు. బైక్, కార్లలో రాకపోకలు సాగించే సందర్శకులు తరచూ ప్రమాదాలతో గాయపడుతుంటారు. వీరిని 108లో లేదా వాహనాల్లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించడం జరిగేది. స్థానికులు, ఇక్కడ బస చేసే సందర్శకులకు ఆరోగ్య సమస్యలు వస్తే ఇబ్బందులు తప్పేవికావు. ఇటీవల కొందరు ప్రముఖులు అస్వస్థత కారణంగా ఇబ్బందిపడ్డారు. ఈ నేపథ్యంలో ఇక్కడ గతంలో డిస్పెన్సరీ ద్వారా వైద్యసేవలు అందించేవారు. స్టాఫ్‌నర్సు నిరంతరం వైద్యసేవలు అందించడం జరిగేది. ఎంతో ప్రయోజనకరంగా ఉన్న డిస్పెన్సరీని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా మూసివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనితో సందర్శకులు, స్థానికులు, ప్రమాదాలకు గురైన బాధితులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే డిస్పెన్సరీని యథాతథంగా కొనసాగించాలని వెద్య, ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీషా, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్‌కమిటి చైర్మన్, ఆర్డీఓ మురళీ కోరారు. దీనిపై ఎమ్మెల్యే డిస్పెన్సరీ పునఃప్రారంభం కోసం నెలరోజులు చేసిన కృషి ఫలించగా వారం క్రితం ప్రారంభమైంది. డిస్పెన్సరీ నిర్వహణలో అనుభవం కలిగిన సాఫ్టనర్సు స్వాతిని నియమించి వైద్య సేవలు అందిస్తున్నారు.

డాక్టర్‌ను నియమిస్తాం



హార్సిలీహిల్స్ పర్యాటక కేంద్రం. దీన్ని అభివృద్ధి చేయడంతోపాటు వైద్యసేవ అత్యవసరమైంది. కొండపై ఏదైనా ఘటన జరిగితే ప్రాథమిక వైద్యం అందించే పరిస్థితి లేదు. దీనితో డిస్పెన్సరీ నిర్వహణకు పట్టుబట్టి ఏర్పాటు చేయించాం. వైద్యసేవలను విస్తరింపజేసి ఒక వైద్యుడ్ని నియమించేలా చర్యలు తీసుకుంటాం.

– ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే

భూదందాలకు పాల్పడితే కఠిన చర్యలు

– డీఎస్పీ కేశప్ప



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : మదనపల్లె పోలీసు సబ్ డివిజన్ పరిధిలో భూదందాలకు పాల్పడే నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటా. భూవివాద కేసుల్లోని నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని డీఎస్పీ కేశప్ప హెచ్చరించారు. మంగళవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ ఆక్రమణ కేసులు ఎక్కువయ్యాయన్నారు. భూవివాదాలు పెరిగి పలు కేసులు నమోదయ్యాయయన్నారు. ఒకరి భూమిలో మరొకరు ప్రవేశించి దౌర్జన్యాలు చేయడం, భూ ఆక్రమణలు, యజమానులను బెదిరించి రిజిస్ట్రేషన్లు చేయడం, రౌడీమూక సపోర్టుతో భూసరిహద్దులు చెరిపివేయడం తదితర సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. మండలంలోని పొన్నేటిపాళ్యం పంచాయతీ భువనేశ్వరినగర్‌లో ఇటీవల తిరుపతికి చెందిన కొందరు రౌడీమూకలు ఓ భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారన్నారు. ఈ కేసులో నరసింహులునాయక్, శివశంకర, నాగరాజు, నూర్‌అహ్మద్, సుందరంపై కేసులు నమోదు చేయడంతోపాటూ రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే సారా, మద్యం తయారీ, అక్రమ రవాణా తదితర చర్యలపై నిఘా పెంచామన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని ఏడు సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిలో నాకాబందీ, మారు మూల తండాల్లో కార్డెన్‌సెర్చ్ తరచూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లాక్డ్‌హౌస్ మోనిటరింగ్ సిస్టంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేరాల నివారణకు రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేసినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు రామ్మోహన్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యావరణం కాపాడుకునే దిశగా చర్యలు తీసుకోవాలని మదనపల్లె ఆర్డీఓ, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ ఎంఎస్.మురళి అన్నారు. టూరిజం మేనేజర్ నేదుమల్లి సాల్వీన్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం సాయంత్రం కొండపై పర్యటించారు. గత టౌన్‌షిప్ కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. నిర్మాణంలోని రెవెన్యూ అతిథిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపైన, కొండ కింద నుంచి రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కల పెంపకాన్ని పూర్తి స్థాయిలో చేపట్టి పర్యావరణం కాపాడుకునేలా సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై సందర్శకుల్లో అవగాహన కల్పించి వాటి వినియోగం తగ్గించేలా కృషి జరగాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మురళీ ఏనుగు మల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎఫ్‌ఓబీ నిర్మాణం చేపట్టాలని డీఆర్‌ఎంకు వినతి



డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం పద్మావతి నగర్ నుంచి రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లు మార్గంలో రైల్వే లైనుపై కాలినడక ఒంతెన (ఎఫ్‌వోబీ) నిర్మించాలని స్థానికులు గుంతకల్లు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం కె. వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం పీలేరుకు విచ్చేసిన ఆయన్ను స్థానిక నాయకులు కాలనీ చిన్న, నాగరాజనాయక్, హయ్యత్‌బాషా కలసి సమస్య విన్నవించారు. రాజీవ్‌నగర్ కాలనీలో సుమారు 3 వేల కుటుంబాలు జీవినం సాగిస్తున్నాయని, రైల్వే వారు ప్రహరీ నిర్మించడంతో పట్టణంలోకి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. బస్టాండ్, ఆసుపత్రికి, పాఠశాలలకు వెళ్లాలంటే సుమారు 3 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తోందని తెలిపారు. స్పందించిన డీఆర్‌ఎం ఎఫ్‌వోబీ నిర్మాణానికి తమవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డీఆర్‌ఎంను దుశ్శాలువతో సత్కరించారు. సహదేవ, బి. వెంకటరమణ, హరీష్,ఆనంద్, రమణ పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులను ప్రోత్సహించాలి

మదనపల్లె : చదువులో చక్కటి ప్రతిభ కలిగి, పేదరికం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జ్యోతిరావుపూలే నాయీబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం స్థానిక అమ్మచెరువుమిట్టలోని త్యాగరాజస్వామి ఆలయంలో పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనపరిచి అధిక మార్కులు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించగలిగితే... వారికిచ్చే నిజమైన ఆస్తి విద్య మాత్రమేనన్నారు. ప్రతిభ కలిగి విద్యలో రాణిస్తున్న నాయీబ్రాహ్మణ విద్యార్థులను ప్రతిఏటా సన్మానించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ఎం.జాహ్నవి, నీతానే హాశ్రీ, ఎం.రోహిత్, పి.నందిని, గౌతమ్‌సాయి, గిరి మునివెంకట్, షాలినీ, కీర్తన, శ్రీనిధిలకు మొమెంటో, నగదు బహుమతిని అందించారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

మదనపల్లె : డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సల్మాన్ మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని టొంతివీధి, త్యాగరాజువీధి, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ శేషగిరబాబు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీలేరు పట్టణంలో మంగళవారం పీలేరు సీహెచ్‌సీ, తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

తంబళ్లపల్లె: డెంగీ నివారణ అందరి బాధ్యత అని ఎంపీహెచ్‌ఈవో రమణ తెలిపారు. మంగళవారం కోసువారిపల్లె పీహెచ్‌సీలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పురవీధుల్లో అవగాహన ర్యాలీ చేశారు. ఎంపీహెచ్‌ఈవో డెంగ్యూ వ్యాధి లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్చవద్దు

– డీవైఈఓ కృష్ణప్ప

మదనపల్లె : ప్రైవేట్ పాఠశాలల మోసపూరిత ప్రకటనలు నమ్మి మదనపల్లె డివిజన్‌లోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చే తల్లిదండ్రులు మోసపోవద్దని డీవైఈఓ కృష్ణప్ప హెచ్చరించారు. మంగళవారం డీవైఈఓ కార్యాలయం నుంచి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలో సీబీఎస్‌ఈ బోధనకు కురబలకోట మండలం అంగళ్లు కదిరిరోడ్డులోని బీఈఎస్ మోడల్ హైస్కూల్, తాటివారిపల్లెలోని విశ్వం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఐసీఎస్‌ఈకు సంబంధించి పోతపోలు పంచాయతీ ఆరోగ్యవరం సమీపంలోని శ్రీవేద ఇంగ్లీష్ మీడియంహైస్కూల్, వశిష్ట స్కూల్, చౌడేపల్లె విజయవాణి స్కూల్‌కు ప్రభుత్వ అనుమతి ఉందన్నారు. మిగిలిన అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిలబస్ బోధించేందుకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉందన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

మదనపల్లె : నిరంతర అప్రమత్తతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని మదనపల్లె టూటౌన్ సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక టూటౌన్ సర్కిల్ కార్యాలయంలో సచివాలయ మహిళా సంరక్షణ పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ, దిశ యాప్ డౌన్‌లోడ్‌లను పెంచాలని సూచించారు.

సకాలంలో వైద్యసేవలు అందించాలి

– డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్

తంబళ్లపల్లె: గ్రామీణ ప్రాంత ప్రజలకు డాక్టర్లు సకాలంలో వైద్యసేవలు అందించాలని జిల్లా డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక వైద్య విధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఎక్స్‌రే యూనిట్, ల్యాబ్ , మందుల విభాగం, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డాక్టర్లు అందుబాటులో ఉండి సిబ్బంది సహకారంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆసుపత్రిలో రాత్రి సమయంలో వైద్యులు ఉండేలా చూడాలని జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం కార్యదర్శి జ్యోతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మెడికల్‌షాపు నారాయణరెడ్డి, బీసీ నాయకులు రామూర్తి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అత్యవసర పరిస్థితిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మదనపల్లెకు వెళ్తున్నారని చెప్పగా స్పందించిన ఆయన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైద్యులు షబానాఫాతిమా, బాబా పక్రుద్దీన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయ వేరుశనగ పంట పరిశీలన

కలికిరి: సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వేరుశనగ పంటను కలికిరి కేవీకే శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. కలికిరి కేవీకే పరిధిలోని కలకడ మండలం ముడియంవారిపల్లికి చెందిన రైతు సదాశివరెడ్డి సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో నిత్యహరిత రకం వేరుశనగ సాగు చేశాడు. విత్తన శుద్ధిలో ట్రైకోడెర్మా విరిడి, ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు, పంట చుట్టూ జొన్న సాగు, వేపనూనె పిచికారీ తదితర పద్ధతులు రైతు పాటించాడన్నారు. ఎకరానికి 8 క్వింటాళ్ళు పంట దిగుబడి వచ్చినట్లు అంచనా వేశారు.

జీతాలు సకాలంలో చెల్లించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

మదనపల్లె : వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని గ్రామ, వార్డు ఎంప్లాయిూస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడినాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో కలిసి తమ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుడినాగరాజు మాట్లాడుతూ..సచివాలయ ఉద్యోగులకు మదనపల్లె మున్సిపాలిటీలో ప్రతినెలా 1వతేదీనే జీతాలు ఇవ్వాలని కోరారు. ఆరునెలల నుంచి బకాయిలు ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. రెండోవిడతలో నియమించిన సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్ వెంటనే పూర్తిచేయాలన్నారు. ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయడంలో జాప్యాన్ని నివారిస్తూ, ఈహెచ్‌ఎస్, ఏపీజీఎల్‌ఐ బాండ్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. పనివేళల్లో మాత్రమే సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. యూజర్‌చార్జీలు, తడి, పొడి చెత్తసేకరణ విషయంలో లక్ష్యాలు ఇవ్వడంతో పర్యావరణ కార్యదర్శులు మానసిక ఆందోళన చెందుతున్నారని, వాటి బాధ్యతను మినహాయించి ఏజెన్సీకి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె సచివాలయ ఉద్యోగుల సమాఖ్య బి.శాంతకుమారిలత, ఈ.పుష్పలత, కే.అశ్విని, బి.సుజాత, టి.పుణ్యవతి, ఎల్.సంధ్యారాణి, అనూరాధ, గాయత్రిదేవి, షిరీన్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



నిమ్మనపల్లె : మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో సోమవారం రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులపాటూ నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఉత్సవాలకై ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. కల్యాణోత్సవ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. పురోహితులు శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కల్యాణోత్సవం సందర్భంగా వేలం వేసిన లడ్డూ ప్రసాదాన్ని వెంకోజిగారిపల్లెకు చెందిన సంజీవోళ్ల బాలు రూ.28 వేలకు దక్కించుకున్నారు. సాయంత్రం ఉట్ల తిరునాల నిర్వహించారు. ఉట్లమాను ఎక్కేందుకు స్థానిక యువత పోటీపడ్డారు. విజేతలకు కమిటీ సభ్యులు బహుమతి అందజేశారు.